జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 24-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 348 పేజీలు: 4 వెల: రూ.7



# నిద్రలోనే.. నైట్ డ్యూటీ!

* ఎస్ఐ రామారావు నిర్వాకం
* పోలీస్ వాహనంలోనే పడక
* విధులను గాలికి వదిలేసిన వైనం
* ఎస్పీ ఆదేశాలు సైతం బేఖాతర్

**శ్రీకాకుళం క్రైం, మే 23 (వార్త):** జిల్లా ఎస్పీగా మహేశ్వర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక రాత్రి వేళల్లో గస్తీని మరింత పటిష్టం చేశారు. దీనికి సాంకేతికతను కూడా జోడించడంతో రాత్రి వేళల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడింది. అయితే కొందరు పోలీస్ సిబ్బంది ఇంకా పాత వాసనలు వదిలినట్టు కనిపించడం లేదు. ఎస్పీ ఆశయాలకు అటువంటివారు తూట్లు పొడుస్తున్నారు.

పైన కనిపిస్తున్న ఫోటోలు చూస్తున్నారు కదా. ఈయన వన్ టౌన్ ఎస్సై-2 రామారావు. శుక్రవారం నైట్ బీట్‌లో ఉన్నారు. రాత్రంతా తిరుగుతూ బీట్లలో పోలీస్ సిబ్బంది సక్రమంగా పనిచేస్తున్నది, లేనిది పర్యవేక్షించి దానికి సంబంధించిన లైవ్ లొకేషన్‌ను, లొకేషన్‌తో కూడుకున్న ఫోటోలను ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్‌లో అప్లోడ్ చేయాలి. ఆయన మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఉన్న ట్రెండ్స్ దగ్గర పోలీస్ జీప్ నిలిపేసి డ్రైవర్‌తో పాటు గురకలు తీస్తూ మత్తుగా నిద్రపోయారు. ఎంతసేపటికి నిద్ర లేవలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే నిద్రలోనే నైట్ డ్యూటీని రామారావు పూర్తి చేసేశారు. నైట్ రౌండ్స్ వేద్దామని డ్రైవర్ వారించినా... ఆల్రెడీ తాను రౌండ్స్ వేసేసానని, ఇంక తిరగడం తన వల్ల కాదని, తనకు ఉన్నతాధికారుల మద్దతు ఉందని చెబుతూ ఎంచక్కా పోలీసు వాహనంలోనే  కునుకు తీశారు. ఆ సమయంలో అటువైపుగా వెళ్తున్న వారు రామారావు పోలీస్ జీప్ లోనే నిద్రపోవడం చూసి ఇదే కదా అసలు సిసలైన పోలీసింగ్ అంటే అని బహిరంగంగానే విమర్శించారు.

## సామాజిక మాధ్యమాల్లో వైరల్..

ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో సైతం వైరల్ గా మారాయి. దీనికి ముందు 80 అడుగుల రోడ్లో కొంతసేపు కునుకు తీసి తర్వాత ఫోటో తీసుకొని పోలీస్ శాఖకు సంబంధించిన గ్రూపులో రామారావు పెట్టేసారు. ఆ తర్వాత రామలక్ష్మణ జంక్షన్ వద్దకు వచ్చి ఇక్కడ అలాగే ఫోటో తీసి గ్రూపులో పెట్టేసి గాఢ నిద్రలోకి వెళ్లిపోయారు. రామారావు చర్య వల్ల పోలీస్ శాఖ పరువు గంగలో కలిసిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అనేక ఆరోపణలు

రామారావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వన్ టౌన్ లో ఎస్సై-2 గా ఆయన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. రోజు సాయంత్రమైతే పెద్ద సంచి పట్టుకొని మార్కెట్లోకి వెళ్లిపోయి నచ్చిన కూరగాయలను అందులో వేసుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్ళిపోతారట. కూరగాయల వ్యాపారులు గట్టిగా ప్రశ్నిస్తే వారిపై రామారావు పోలీస్ జులూం చూపిస్తారని వినికిడి. అంతేకాకుండా వన్ టౌన్ పరిధిలో ఫ్రూట్ షాపుల నుంచి సీజన్ బట్టి పండ్లు, కిన్నెరా థియేటర్ ఆవరణలోని షాపులో సాయంత్రం టి, సమోసాలు, బజ్జీలు బలవంతంగా లాక్కుంటారట. గట్టిగా ప్రశ్నిస్తే అదే రోజు రాత్రి 9 తర్వాత షాపుల వద్దకు వెళ్లి వెంటనే దుకాణాలు మూసేయాలని, సమయం దాటిపోయిందని, లేకుంటే కేసు పెడతానని బెదిరిస్తారట. ఇటీవల వన్ టౌన్ పరిధిలోని ఓ మద్యం షాపు నుంచి కాస్ట్లీ బ్రాందీ సీసాను ఎస్సై అని చెప్పి డబ్బులు ఇవ్వకుండా రామారావు ఎత్తుకెళ్లారట. చేసేది లేక దాని యజమాని మిన్నకుండిపోయారు.

## స్వయంగా పేకాడుతూ..

ఏఎస్ఐగా ఉన్న సమయంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఓ ఇంట్లో కొందరితో కలిసి రామారావు రోజు పేకాడుతుండేవారట. దీనిపై వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో అప్పటి ఎస్సై-2 రాము నేరుగా ఆ ఇంటి మీద రైడ్ చేశారు. పేకాడుతున్న వారందరినీ పట్టుకున్నారు. తాను ఏఎస్ఐనని, వదిలేయాలని కాళ్లా వేళ్లా పడడంతో రామారావును అక్కడి నుంచి పంపించేశారన్న  గుసగుసలు అప్పట్లో వినిపించాయి.

## వైసీపీ నాయకుడు పేరు చెప్పి..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికి రామారావు స్వయానా బావ. రవి పేరు చెప్పి పోలీస్ శాఖలో రామారావు రుబాబు చేస్తున్నట్టు విమర్శలు వెలువెత్తుతున్నాయి. మా బావ త్వరలో ఎమ్మెల్యే అయిపోతాడని, అప్పుడు డీఎస్పీలకు కూడా తానే పోస్టింగ్లు ఇస్తానని, ఉన్నతాధికారులు కూడా తన వద్దకు వచ్చి సెల్యూట్ కొడతారని, అయితే ఇంతలోగానే తాను రిటైర్ అయిపోతానని రామారావు బీరాలు పలుకుతున్నాడట. వైకాపా అధికారంలోకి వచ్చి ఉంటే ఆమదాలవలస నియోజకవర్గంలోని ఏదో ఒక పోలీస్ స్టేషన్కు తాను ఎస్‌హెచ్ఓ అయి ఉండేవాడినని, తమ పార్టీ అధికారంలోకి రాకపోవడం దురదృష్టం అని బాధపడుతున్నాడట. కొన్ని కీలక కేసులకు సంబంధించి దర్యాప్తు అంశాలను డీఎస్పి, ఎస్పీ కూడా తననుంచే అడిగి తెలుసుకుంటారని రామారావు చెబుతుండడం కొసమెరుపు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించరన్న పేరు యువ ఐపీఎస్ అధికారి, ఎస్పీ మహేశ్వర్ రెడ్డికి ఉంది. నైట్ డ్యూటీలో నిద్రపోతున్న రామారావుపై జిల్లా పోలీస్ బాస్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



## నేటి నుంచి జర్మనీలో మినీ మహానాడు

**-ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి**

**పలాస, మే 23 (వార్త) :** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా మహానాడు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా జర్మనీలో ఈ నెల 24, 25న మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. జర్మనీ ఎయిర్ పోర్టునకు చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు మినీ మహానాడు ఆహ్వాన కమిటీ సుమంత్ కొర్రపాటి, అఖిల్ దున్న, రాజశేఖర్ పార్ణపల్లి, విక్రమ్‌కుమార్ తల్లపనేని, కళ్యాణ్ సుంకు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**- ఎస్పీ మహేశ్వర రెడ్డి**

**పలాస, మే 23(వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులు ను పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధి లో గల పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. బాధితుల సమస్యలను విని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి , కొట్లాట,మిస్సింగ్, చీటింగ్ ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్పీ సూచించారు. కాశీబుగ్గ డీఎస్పీ ఎం వెంకటప్పారావు, సీఐలు పి.సూర్యనారాయణ, తిరుమలరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కేశవరావు ఎన్‌కౌంటర్‌పై

# సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించండి



**పలాస, మే 23(వార్త):** మావోయిస్టు పార్టీ అఖిల భారత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు గంగన్న ఆయనతోపాటు 27 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన భౌతికకాయం కుటుంబ సభ్యులకు అప్పగించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్,పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, అమరుల బంధు మిత్రుల సంఘం, ప్రజా కళామండలి, ప్రగతిశీల కార్మిక సమైక్య, సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో నిరసన ర్యాలీ కి సిద్ధమైతే పర్మిషన్ లేదనే పేరుతో కాశిబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీనిని అందరూ ఖండించాలని తక్షణమే మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ , ఆదివాసీల హననం ఆపాలని డిమాండ్ చేస్తూ పార్టీ కార్యాలయం పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. అనంతరం రాజ్యహింసను వ్యతిరేకిస్తూ రాజ్యాంగబద్ధంగా పాలించాల్సిన పాలకులు చట్టాలను ఉల్లంఘించి రాజ్యాంగం పక్కనపెట్టి అన్యాయంగా దుర్మార్గంగా ఈ దేశ పౌరులైన ఆదివాసీల పైన, మావోయిస్టులని టార్గెట్ చేసుకొని 550 మందిని ఇప్పటికే చంపారు. కార్పొరేటర్లకు అడవులను అప్పగించడానికి అందుకు ఆటంకంగా ఆదివాసీలు ఉన్నారని ఆదివాసీలను, మావోయిస్టులను, ప్రశ్నించే వాళ్లను అందరినీ చంపుకుంటూ పోతున్నారు. ఇది అత్యంత దుర్మార్గం. మోదీ అమిత్ షా ఫాసిస్ట్ పాలనకు ఇది నిదర్శనం. ప్రజలు ప్రజాస్వామికవాదులు బుద్ధి జీవులు ఈ సంఘటనకు పై నిరసన వ్యక్తం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి ధానేషు, లిబరేషన్ నాయకులు రామారావు, పిడియం రాష్ట్ర నాయకులు సాలిన. వీరాస్వామి,అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి.కోదండరావ్, తామాడ త్రిలోచన, అమరుల కుటుంబ సభ్యులు పోతనపల్లి అరుణ, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కుర్రా ఈ నీలకంఠం, ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా అధ్యక్షులు మద్దెల ధర్మారావు , పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు,జీడి రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల.ఈశ్వరమ్మ అఖిల భారత రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, సారా జగన్ బర్ల గోపి పాల్గొన్నారు.

# వైసీపీ పటిష్టతకు కలిసికట్టుగా పని చేయాలి

**-జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్**



**శ్రీకాకుళం, మే 23 (వార్త):** వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కార్యాలయం యందు జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన నియోజకవర్గ సమన్వ యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడమైంది. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా కలిసి మెలిసి పని చేయాలన్నారు. కార్యకర్తలకు అభిమానులకు తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి వృద్ధాప్యం పింఛను నేటివరకు దాని ఊచేలేదన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు కుంభ రవిబాబు మాట్లాడుతూ ఏపీలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అభివృద్ధి సంక్షేమం ఊచెలేదని రెడ్ బుక్ రాజ్యమేలుతుందన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసిన పార్టీ మనదేనని భవిష్యత్తులో పేదలకు మేలు చేసే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు. రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచకపాలన జరుగుతుందని, పరిపాలన గాడి తప్పిందని రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కార్యకర్తలను నాయకులను ఇబ్బంది పెడుతున్నారని తె లి య ే జ ే శా ర ు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్, ఎం.ఎల్.సి నర్తు ం ా వ ా ం ా వ ు , సమన్వయకర్తలు రెడ్డి శాంతి (పాత పట్నం), చింతాడ రవి కుమార్ (ఆమదాలవలస), గొర్లె కిరణ్ కుమార్ (ఎచ్చెర్ల), పేడాడ తిలక్ (టెక్కలి) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్య నారాయణ, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వివిధ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, ఎమ్.పి.పిలు వాన గోపి, అంబటి నిర్మల శ్రీనివాస్, గొండు రఘురాం, బైరాగినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురు షోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్,ఎం స్వరూప్, గొండు కృష్ణ,జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రౌతు శంకరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మార్పు పృథ్వీరాజ్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు గుప్తా, తమ్మినేని చిరంజీవి నాగ్, చిట్టి జనార్ధన, మూకాళ్ళ తాతబాబు, గుంగు నరేంద్ర, గుండ హరీష్,ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణ, బైరి మురళీ, తంగి అప్పన్న స్వామి, కింజరాపు రమేష్, బేగ్, యస్.సత్యనారాయణ, యజ్జల గురుమూర్తి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.







## కాలువల్లో పూడికలు తీసివేత

**సరుబుజ్జిలి, మే 23 (వార్త):** తెలికిపెంట పంచాయతీ సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, టీడీపీ గ్రామ అధ్యక్షులు నందివాడ కృష్ణారావు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజీలోని పూడికలు శుక్రవారం తీయించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు మాట్లాడుతూ డ్రైనేజీలో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు ఆగిపోవడంతో పూడికలను తీసివేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఐవీఎఫ్ కేంద్రాల తనిఖీ



**శ్రీకాకుళం, మే 23 (వార్త):** శ్రీకాకుళం నగర పరిధిలో గల రీజాయిస్ ఫెర్టిలిటీ హాస్పిటల్, ఏ1 హాస్పిటల్, జెమ్స్ హాస్పిటల్‌లో గల ఫెర్టిలిటీ సెంటర్‌ను శుక్రవారం డిప్యూటీ డీఎహెచ్‌వో మేరీ కేథ్రిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పర్యటనలో డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేషన్ విజయలక్ష్మి ఉన్నారు.

## డా.గేదెల రవికి కేంద్ర మంత్రి అభినందన



**శ్రీకాకుళం, మే 23 (వార్త):** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గౌహతీ నుంచి బయోసైన్సెస్ అండ్ బయోఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా సాధించిన ఎచ్చెర్లలోని ఆర్‌జీయూకేటీ ప్రొఫెసర్ డా.గేదెల రవిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తక్కువ ఖర్చుతో బయోప్రాసెసింగ్ విధానాల అభివృద్ధికి ఈ పరిశోధన ఫలితాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు.

## 27న ఆదిత్యుని హుండీల లెక్కింపు

**శ్రీకాకుళం, మే 23 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు ఈ నెల 27న జరుగుతుందని ఉప కమిషనర్, కార్యనిర్వాహక అధికారి భద్రాజీ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ ఆరోజు ఉదయం 8 గంటలకు సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం హుండీలు తెరుస్తామని తెలిపారు. డిపార్ట్‌మెంట్, అనువంశిక ధర్మకర్త, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలు తెరుస్తామన్నారు.

## మామిడి పండ్లు కృత్రిమంగా ముగ్గిస్తే చర్యలు

**శ్రీకాకుళం, మే 23 (వార్త):** మామిడి పండ్లను కృత్రిమంగా ముగ్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి కె. వెంకటరత్నం వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలో మార్కెట్, పరిసర ప్రాంతాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పండ్ల దుకాణాల మీద శుక్రవారం దాడులు నిర్వహించారు. కృత్రిమంగా పండ్లను మాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొబడునని తెలియపరచి మామిడి పండ్లును శాంపిల్స్ తీసికొని లేబ్ కు పంపించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పేదలకు ఆసరా సీఎం సహాయ నిధి

**శ్రీకాకుళం, మే 23 (వార్త):** పేదలకు ఆసరా సీఎం సహాయ నిధని, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మహాలక్ష్మి నగర్ కోలనీకి చెందిన వనరాస.సురేష్ రహదారి ప్రమాదంతో మంచా నికే కొంతకాలంగా పరిమితమయ్యారు. లివర్ సంబంధిత వ్యాధితో కూడా బాధపడుతు న్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా, మంజూరైన రూ.66,900ల చెక్ ను బాధితునికి ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం అందించారు. కార్యక్రమంలో సురేష్ కుటుంబసభ్యులు, స్థానికులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

**శ్రీకాకుళం, మే 23 (వార్త):** ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారికి వైభవంగా కళ్యాణం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు వైశాఖ బహుళ ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

## తహసీల్దార్ ను కలిసిన సంఘ నాయకులు



**మందస, మే 23(వార్త):** మందస నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మిస్క శ్రీకాంత్ ను స్థానిక దళిత, గిరిజన, ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. మందస మండలాన్ని మరింత అభివృద్ధిపథంలో ముందుకు తీసుకుపోవాలని, తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, గవ్వ భీమారావు, యస్.గణేశ్వరరావు, యస్.అప్పారావు, యస్.అబ్రహం, యస్.గోపాలరావు, బి.కుశరాజు, బి.జ్యోతిశ్వరి, బి.పాపమ్మ పాల్గొన్నారు.

## ముగిసిన కిశోర వికాసం సదస్సులు



**ఇచ్ఛాపురం, మే 23(వార్త):** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏడు విడతలుగా జరిగిన కిశోర వికాసం సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలతో గ్రూప్ ఏర్పాటు చేసి లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన పై అవగహన కల్పించారు. 3 వ వార్డు ఏఎస్ పేటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రోజెక్టు ఆఫీసర్ నాగరాణి, సూపర్‌వైజర్ సుజాత, మహిళా పోలీస్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలి

**కొత్తూరు, మే 23(వార్త):** ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నవారు ఏ పార్టీకి చెందివారైనా ఎంతటి వారైనా చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని వైఎస్సార్ సీపీ కొత్తూరు మండల అధ్యక్షులు గండివలస ఆనందరావు,జడ్పీటీసీ కామక భాగ్యవతి, పలువురు మండల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ లతో కలిసి మండల తహసీల్దార్ కె. బాలకృష్ణకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కొత్తూరు మండలం మెట్టూరు పంచాయతీ నేరడి రెవెన్యూ సర్వే నెంబర్ 114 లో 2.39. సెం. విస్తీర్ణం గల డి పట్టా (ప్రభుత్వ భూమి)లో నిర్మాణాలు పై రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి ఆక్రమణ దారులు నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని వైసీపీ మండల అధ్యక్షులు ఆనందరావు, ఆ పార్టీనేతలు డిమాండ్ చేశారు.ఈ ఆక్రమణలు పై మండలం తహశీల్దార్ జోక్యం చేసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని, ప్రభుత్వం ప్రజా అవసరాలకు ఈ ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు బూర్లె శ్రీనివాస్ రావు, ఎద్దు హరిదాస్, ఎంపీటీసీ లు అగతముడి నాగేశ్వరరావు, వనుమ లక్ష్మీ నారాయణ, మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, మొదలవలస పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, మే 23 (వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం టౌన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని గత 10 నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎండీయూ ఆపరేటర్ల పొట్ట కొట్టొద్దు



**మెళియాపుట్టి, మే 23 (వార్త):** తమ పొట్ట కొట్టొద్దని కోరుతూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు డిప్యూటీ తహసిల్దార్ రాముకు శుక్రవారం విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఎండియు ఆపరేటర్ల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ సజావుగా సాగుతుందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు తుంగాన కుమార్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ పరిధిలో ప్రజలకు నేరుగా బియ్యం అందించేందుకు వాహనాలు ఎంతగానో దోహదపడుతున్నాయని, వేలాది మంది ఆపరేటర్లు ఇదే ఉపాధిగా అనేక సందర్భాల్లో ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ వదులుకొని మరి ఈ ఉపాధిలో కొనసాగుతున్నారని నేడు ప్రభుత్వం ఈ పథకం కొనసాగింపు నిలిపివేస్తే వీరంతా రోడ్డున పడడమే కాకుండా ప్రజలకు నేరుగా సేవలు అందించేందుకు వీలుపడదని తెలిపారు. ఎం డి యు వ్యవస్థలో లోపాలు ఉంటే ప్రభుత్వం పర్యవేక్షణ కఠినం చేసి మరింతగా పరిశీలించాలని తద్వారా లోపాలు సరి చేయాలని, ఆ విధంగా కాకుండా ఉన్న వ్యవస్థను ప్రజలకు దూరం చేస్తే వచ్చే సమస్యలకు ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఆయనతో పాటుగా మిగతా ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారు.

# నంబాల మరణంతో అణగారిన ఆదివాసీలకు తీరని నష్టం

**-డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్**



**మందస, మే 23(వార్త):** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణంతో భారతదేశంలోని అణగారిన ఆదివాసీలకు తీరని నష్టం వాటిల్లిందని డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఆవేదనను వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మతోన్మాద ఉగ్రవాదులు మన భారత దేశ పౌరులకి కొన్ని దశాబ్దాల నుంచి అన్యాయంగా కాల్చి చంపితే కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల్లోనే శత్రు దేశాలతో శాంతి చర్చలకి సిద్ధం అయ్యారు కానీ మన దేశ సొంత పౌరులపై శాంతి చర్చలకు ఎందుకు దూరంగా ఉన్నారన్నారు. మన దేశ అడవి సంపదని ఇతర దేశస్తులకి, కార్పొరేట్ శక్తులకి అప్పనంగా ఇవ్వడం కోసం ఎదిరించే వాళ్ళని లేకుండా చెయ్యాలని ఉద్దేశంతో ఈ దాడులు చేస్తున్నారా అని ప్రశ్నించారు. అడవి సంపదని దోచుకోవడానికి ప్రభుత్వ సింహాసనంపై కూర్చున్న స్వార్థపూరిత రాజకీయ నాయకులు ఎన్నో ఏళ్ళు నుంచి ఎమ్.ఓ.యు లు చేసి ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. అన్యాయాన్ని ఎదిరించే వాళ్లని లేకుండా చెయ్యాలన్న నాయకులు చేస్తున్న ఫేక్ ఎన్కౌంటర్లుని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. జనాల్లో ఉండి ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ లని ముద్ర వేస్తున్నారని ఆరోపించారు. ఉపా కేసులు పెట్టి జైల్లో పెడతానని బెదిరిస్తున్నారని, అడవిని అక్కున చేర్చుకొని ఇక్కడి నుండి ప్రశ్నించి సహకరిస్తే నక్సలైట్లు అంటూ మారణ హోమం చేస్తున్నారన్నారు. ఒక సామాన్యుడికి జీవించే హక్కును కల్పించిన భారత రాజ్యాంగంలో ఇలాంటి హత్యలు భవిష్యత్ తరాలకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని గట్టిగా చెప్పదలచుకుంటున్నానన్నారు. మావోయిస్టు పార్టీ గత 50 సంవత్సరాల నుంచి మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎందుకు పోరాడుతున్నాయో ఇప్పటి వరకు తెలిసికోలేకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. పాకిస్థాన్ మతోన్మాద ఉగ్రవాదులని ఒక తేదీ ప్రకటించి అంతం చేస్తామని చెప్పి, మన దేశ పౌరులకి కేంద్ర ప్రభుత్వం గట్టి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. అంతే కానీ మన దేశంలో పుట్టి పెరిగిన అమాయక ఆదివాసీలని చంపి అడవి సంపదను కొల్లగొట్టడం కరెక్ట్ కాదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని బత్తిని లక్ష్మణ్ అన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 700 మందితో ప్రత్యేక యోగా శిబిరం





**శ్రీకాకుళం, మే 23 (వార్త):** అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో ప్రధాన మంత్రి మోదీ పాల్గొననున్న ప్రత్యేక కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని జిల్లాల్లోనూ నెల రోజుల పాటు యోగా శిక్షణా శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కలెక్టర్ డా. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు శుక్రవారం ఉదయం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, గార మండలాల నుంచి ఐసిడిఎస్ సిబ్బంది, చిల్డ్రన్ హోమ్స్‌కు చెందిన చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొత్తం 700 మందికి పైగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం విశేషం. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ సమన్వయ అధికారి డాక్టర్ జగదీష్, ఐసిడిఎస్ అధికారి బి.శాంతిశ్రీ, నోడల్ అధికారి మనెమ్మ, ఇద్దరు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు. యోగా ద్వారా శరీర ధృడత్వం, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని వారు వివరించారు. ప్రజలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని దాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.





# పొలం కాదు.. రహదారే!

* ఓట్లకు మాత్రం ఉపయోగపడే సిరుసువాడ - కుంటిభద్ర రహదారి
* అట్టహాసంగా శంకుస్థాపన.. ఆ తరువాత కనిపించని నాయకులు
* ఇక్కడి ప్రజలలో చైతన్యం లేకనే ఈ గ్రామ రహదారులు ఇలా!



**కొత్తూరు,మే 23 (వార్త):** ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ వచ్చిందని కూటమి నాయకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. నిజమేనేమో ఒకప్పుడు రైతులు వారి పంటని పొలల్లో వేసేవారు కానీ ఇప్పుడు మాత్రం ఆ మహార్దశ వల్ల గ్రామీణ రోడ్ల మీద కూడా పండించవచ్చునని కొత్తూరు మండలంలోని సిరుసువాడ - కుంటిబద్ర రహదారులను చూస్తే ఒప్పుకోకతప్పదనే చెప్పాలి. ఈ గ్రామాలలో రాజకీయ ఉద్దండులు చాలా ఏళ్ల నుంచి వున్న గత ప్రభుత్వంలో ఈ రహదారులను బాగుచేయలేదు అని ప్రజలలో ఒక ఉదాహరణగా వాడుకోవడం జరిగినది. అయితే మొన్న జరిగిన ఎన్నికల్లో బాగంగా ఈ గ్రామ ప్రజలకు మళ్లీ ఇదే రహదారులను గెలిచిన తరువాత 100 రోజులలో బాగుచేస్తాం అన్న నాయకులు ఇటీవల రోజులలో శంకుస్థాపనను అట్టహాసంగా చేసి ఆ మరునాడు ఎంతో కొంత బాగానే ఉన్న రహదారులను తవ్వించివేశారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆ రహదారిపై నడిచే వీల్లేకుండా పోయింది. కొత్తూరు నుంచి సిరస్సువాడ రాత్రి వేళలో రావాలంటే ఇంటికి వెళ్లాడమేమో గాని హాస్పటల్‌కు మాత్రం ముందుగా వెళ్ళేటట్లు చేసేశారని గ్రామస్తులు నాయకులకు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారికి సుమారుగా రెండు కోట్ల రూపాయలు వ్యయంతో రోడ్డు పనులను చేయడం జరుగుతుందని శంకుస్థాపన రోజున స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. కాంట్రాక్టర్‌ని గ్రామస్తులకు పరిచయం చేశారు. రెండు నెలలకు పైన అవుతున్న ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్ దర్శనం లేదని, రహదారికి ఇరువైపులా మట్టిని తవ్వి మరలా అదే మట్టిని రహదారిపై వేసి కొంత మెటల్‌ను పక్క నున్న పొలాలలో వేసి ఇదే మీ గ్రామాల రహదారని చూపిస్తున్నట్లు ఉందని ఈ గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా ప్రతి ఎన్నికలలో నాయకులు వస్తున్నారు రహదారులు బాగుచేస్తామని హామీలను ఇస్తున్నారు తప్ప ఈ గ్రామాల రహదారులకు పనులు మాత్రం జరగడం లేదు. ఈ గ్రామ ప్రజలకు అదృష్టం లేకపోవడం వల్లనో లేక ఇక్కడి ప్రజల్లో ఇంకా చైతన్యం రాకపోవడం వల్లనో తెలీదు గాని ఎన్నో ఏళ్లుగా ఈ రహదారులను ఏ నాయకుడు కూడా దయ చూపించడం లేదని ఆ గ్రామంలోని కొందరు యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సిక్కోలు కీర్తిచక్ర మేజర్ నాయుడు

* రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తిచక్ర పురస్కారం * రాంగోపాలనాయుడిది నగిరిపెంట
* అభినందనలు తెలిపిన మంత్రులు రామ్మోహన్, అచ్చెన్న



**సంతబొమ్మాళి, మే 23 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ మల్ల రాంగోపాల్ నాయుడు భారత సైన్యం అందించే అత్యున్నత పురస్కారాల్లో రెండోదైన కీర్తిచక్ర పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకున్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఏటా సైనికులు ఇచ్చే గ్యాలంట్రీ అవార్డులను ఈ ఏడాదికి సంబంధించి గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మొత్తం నాలుగు కీర్తి చక్ర అవార్డులను ప్రధానంచేశారు. ఇందులో ముగ్గురు అధికారులు వీర మరణం పొందాక అందుకుంటే, మన రాష్ట్రానికి చెందిన మల్ల రాంగోపాల్ నాయుడు మాత్రం స్వయంగా ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకుని సగర్వంగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం, నగిరిపెంట గ్రామానికి చెందిన సన్నకారు రైతు అప్పలనాయుడు కుమారుడైన నాయుడికి చిన్నప్పటి నుంచే సైన్యంలో చేరాలని కోరిక ఉండేది. విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, 2012లోనే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్డీఏ) పరీక్ష ద్వారా నాయుడు భారత సైన్యంలోకి ప్రవేశించారు. డెహ్రాడూన్ లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ నుంచి బంగారు పతకంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం ఇండియన్ ఆర్మీలో లెఫ్ట్ నెంట్ హెూదాలో అడుగుపెట్టిన నాయుడు, 2022లో మేజర్ హెూదా పొందారు. ప్రస్తుతం 56 రాష్ట్రీయ రైఫిల్స్ లోని మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీలో మేజర్ హెూదాలో పనిచేస్తున్న నాయుడు, జమ్ము కశ్మీర్‌లోని కుప్వారాలో నియంత్రణ రేఖ వెంట ఉగ్రవాదులను మట్టుబెట్టే విషయంలో అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారు. 2023లో జరిగిన ఈ ఆపరేషన్‌లో నాయుడు సాహసోపేతమైన చర్యలతో ఉగ్రవాదులు హతం చేసిన విషయాన్ని భారత ప్రభుత్వం గుర్తించి వారిని కీర్తిచక్ర అవార్డుకు ఎంపిక చేసింది.

2023లో అక్టోబర్ 26 ఉదయం నాయుడు క్యాంపునకు సమీపంలో ఉగ్రవాదులు ఉన్నట్లుగా సమాచారం అందింది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా మేజర్ నాయుడు నేతృత్వంలో మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ బెటాలియన్‌తో పాటు 56 రాష్ట్రీయ రైఫిల్స్ సైనికులు రంగంలోకి దిగిపోయారు. ఉగ్రవాదులు కంటబడినంతనే తన బృందానికి నాయకత్వం వహిస్తున్న నాయుడు, నాయకుడిగా అందరి కంటే ముందు ఉండి కదిలారు. ఉగ్రవాదులను చీల్చిచెండాడుతూ కదిలారు. ఈ క్రమంలో ఇద్దరు ఉగ్రవాదులు తమకు సమీపంలోని ఓ గుహలో దాక్కోగా, నాయుడు తన బృందాన్ని సేఫ్ మోడ్‌లోనే ఉంచి,త ను ఉగ్రవాదులపైకి లంఘించారు. తమపైకి సింహంలా దూకుతూ వస్తున్న నాయుడును చూసి ఉగ్రవాదులు గ్రెనేడ్లను విసురుతున్న, తనప్రాణాలను సైతం ఏమాత్రం లెక్కచేయకుండా వాటినుంచి తప్పించుకుంటూ ఉగ్రవాదులకు అతిదగ్గరికి చేరి, ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. మన రాష్ట్రానికి చెందిన రాంగోపాల్ నాయుడు గురువారం కీర్తిచక్ర పురస్కారం అందుకోవడం జిల్లావాసులకు గర్వకారణం.

## మేజర్ నాయుడుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ అభినందనలు

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన ఆర్మీ మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడు కీర్తిచక్ర పురస్కారం అందుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యక్తిగతంగా ఆయనను కలిసి అభినందించారు. తన ప్రాణాలను పణంగా పెట్టి ఉగ్రవాదులను ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన రామ్‌గోపాలనాయుడు దేశం గర్వించదగ్గ సైనికుడని కొనియాడారు. దేశ రక్షణ వ్యవస్థలో రెండవ అత్యున్నత గ్యాలంట్రీ అవార్డు అయిన కీర్తిచక్రకి ఎంపికైన తొలి తెలుగువాడిగా మేజర్ రామ్‌గోపాలనాయుడు చరిత్రలో నిలిచారని మంత్రి అన్నారు. ఆయన చూపిన పోరాట పటిమ, దేశ భక్తి యువతకి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణంగా నిలిచిన మేజర్ రామ్‌గోపాలనాయుడు వంటి వీర సైనికులని ఆదర్శంగా తీసుకొని యువత దేశ సేవలో పాల్గొనాలని మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు.

## మేజర్ నాయుడుకు అరుదైన గౌరవం: అచ్చెన్న

దేశ రక్షణ బాధ్యతల్లో అత్యంత కీలకంగా ఉంటూ ఉగ్రవాదుల దాడులు సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన మేజర్ మళ్ల రాంగోపాల్ నాయుడుకు కీర్తి చక్ర అవార్డు దక్కడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లాకు చెందిన సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామంలో జన్మించిన ఆయనకు ఇంత గౌరవం దక్కడం జిల్లాకు గర్వకారణమన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546